అర్ధభాగాలలో భిన్నహృదయాలు.

'మీ రలా యేడుస్తూ కూర్చుంటే యెలాగండీ? ఆయన కేం, పుణ్యాత్ములయ్యారు!'

'........................'

'నాలో దుఃఖం లేదా? నేను మీ కంటే హెచ్చుగా యేడవలసింది'

'........................'

'అబ్బాయి యేడుస్తున్నాడు. పాలది యింకా పాలు తీసుకరాలేదు. ఒక్కసారి వెళ్లండి...'

'ఆచావు నాకైనా వచ్చిందికాదు. యీ సంసారబాధలన్నీ యెవరుపడ్తారు?'

'రామ రామ! అవేం మాటలండి. పోనీ, కమలాన్నే పంపిస్తాది లెండి.'

'వీధిలోనికి పంపకు; నలుగురూ నవ్వుతారు'.

రుక్మిణి మరి మాటాడలేకపోయింది. వంట యింట్లో కూర్చున్న కమలం కారుతున్న కన్నీటిని చీరకొంగుతో తుడుచుకొంటూంది.

'యీకర్మ యెలాచేసే?...?.

'అదుకేనా అంతగా విచారిస్తున్నారు? మామయ్యగారు బ్రితికినంతకాలం ధర్మంగాపోయారు. అంత పెద్దనౌకరీ చేసినా ఒక్కకానీ లంచం పుచ్చుకోలేదు. అందుచేతనే యేబాధలేకుండా స్వేచ్ఛగా మరణించారు. ఆయనకర్మకు ఆయనే

డబ్బు సమకూరుస్తారు. ధైర్యం చెప్పవలసిన మీరే అలా యేడుస్తూ కూర్చుంటే...చూడండి. పిల్లాడు పాలులేక యెలా యేడుస్తున్నాడో! చూశారా! వంట యింట్లో మీ చెల్లెమ్మ—మీ కడుపే కాదు, అందరి కడుపులూ దహించుపోతున్నాయ్. కాని చచ్చేవారితో మనం చస్తామా! అన్ని విషయాలూ మీకు తెలుసు. ధైర్యం తెచ్చుకోండి...'

'సరే, ఆ పాలచెంబు యిలాతే' అంటూ మంచంమీదనుంచి చిరాకుగా లేచాడు కిష్టయ్య. కమలం పాలచెంబు తెచ్చి అందిచ్చింది. అన్నయ్యవద్దకు రావటంతోనే ఆమె దుఃఖం పొంగి పొరలింది.

'ఈ పాడుయింట్లో ఆడబిడ్డవై యెందుకు పుట్టావమ్మా? ఆమాత్రం మాబాధ్యతను తీర్చుకోలేకపోయాం...' అంటూ కిష్టయ్య చేతితో తన నుదురు పట్టుకొని గబగబా వీధిలోనికి నడిచాడు.

రుక్మిణమ్మ మాట్లాడామన్నా పెదిమలు కదలలేదు. కమలానికి తామంతా ద్రోహంచేశారు. పెద్దమనిషై ఆరుసంవత్సరాలైంది. ఇంకా పెండ్లంటూ చెయ్యలేదు. 'నేనే చక్రవర్తినైతే వరకట్నాలు పుచ్చుకున్నవాడికి వెయ్యేండ్లు కఠినశిక్ష వేసేస్తానురా కిష్టయ్యా!' అన్న మామపలుకులు యింకా రుక్మిణిచెవులో మారుమోగుతూనే వున్నయ్. అంత శాంతపరుడైన మామగారికి యీ కమలంసంబంధకోసం వచ్చినవారు అడిగినవరకట్నాలవిషయమై అంత చిరాకూ, కోపం వచ్చినై. 'పెద్దశిరస్తాదారుపనిచేశాడే! అరవైరూపాయలు ఫించనుపుచ్చు

కుంటున్నాడు. కొడుకో నలభై రూపాయలుజీతం తెచ్చుకుంటు న్నాడుగదా. ఆ మాత్రం వెయ్యినూటపదహార్లు కట్నం యీా యలేడేం? యెందరున్నారని యింకా—యీా ఒకేఒక కూతు రేకదా? అన్నవారే ప్రతీవారూనూ. మొత్తంమీాద కమలం పెండ్లికోసం చివరిరోజులలో పరితపించి పరితపించి చివరకు పెండ్లి చెయ్యకుండానే స్వర్గస్థుడయ్యాడు రామయ్య.

రామయ్యగారు వున్నప్పుడు కిష్టయ్యకు కుటుంబబాధ్యత తగలలేదు. ఉద్యోగంచెయ్యటం, జీతంతెచ్చి తండ్రిచేతులలో పెట్టడం, వేళకుయింతభోజనం చెయ్యటం—ఇదే ఆయనపని, కుటుంబభారమంత అరవై యేండ్లు నిండిన రామయ్యనెత్తినేవుండేది. కిష్టయ్య నలుగురు పిల్లలతండ్రి అయినప్పటికి చాలా స్వేచ్ఛగా తిరిగాడు.

తన బావుటా దిగ్విజయంగా యెగిరేటప్పుడు రామయ్య అందరినీ ఆదరించాడు. అందరూ మావారేఅన్నాడు. వచ్చే జీతమంతా బంధు ఆదరణకే వినియోగించాడు. ఆర్జించిన దేమీాలేదు. యేముందో— పెండ్లికాలమందు రుక్మిణమ్మమెడలో వేసిన పదిహేనుతులాల బంగారంగొలుసు మిగిలిఉంది. తను ఫించను పుచ్చుకున్నతరువాత తన ఫించనూ, తనకొడుకు జీతమూా వచ్చిన చుట్టాలక్రిందా, సంసారం సాగటానికి సరిపోయేది. రామయ్య మావాడే, మాఅల్లుడు చిన్నాన్నతాత మనుమడు' అని యిలా రకరకాల వరసలు కల్పించి తిష్ఠవేసే వారు మూాడునాలుగురోజులు. కిష్టయ్యకు సంసారం గొడవే ఉండేది కాదు. రుక్మిణిమామగారు యేలాఅంటే అలా. ఆమెకు తండ్రియినా, తల్లయినా రామయ్యగారే. రామయ్యగారు

రుక్మిణిని బంధుజనాదరణలో అందెవేసిన చెయ్యిని చేశారు. సంసారపు ఒడుదుడుకులను రుక్మిణి అవగాహన చేసుకొని ధైర్యంతో మెలగగలిగేది

రామయ్యగారు చనిపోయేవరకూ మాట్లాతూనే యున్నారు. కూతురు కమలాన్ని చేరదీసి 'అమ్మా, మీనాన్నను క్షమించు...అన్నిటికీ మహాయిల్లాలు నీ వదినవుంది...' అన్నాడు. యింకా యేదో మాట్లాడబోయాడు కాని పెదిమలు కదలలేదు. దుఃఖం ముంచుకొచ్చింది. ఆయన నాలుగు హంగులూ చూసుకొని కుమార్తెను మంచియింట్లో వేద్దామని వుబలాటపడ్డాడు. కాని ఆ కట్నం యెక్కడనుంచి తేవటం? రుక్మిణమ్మ తనగొలుసు అమ్మడానికి సిద్ధపడింది. కాని రామయ్య ససేమిరా ఒప్పుకోలేదు. ఒకవేళ అమ్మినా అది ఆరోజుల్లో వెయ్యిన్నూట పదహార్ల ఖరీదు చెయ్యదు.

శ్రాద్ధభోజనానికి కులంవారంతా తయారే 'యేమోయ్ కిష్టయ్యా! రామయ్యగారుపోయి వారంరోజులైనా యింకా పప్పులూ, వుప్పులూ యేమీ సమకూర్చుకో లేదేం? చాలా ఘనంగా బ్రతికాడోయ్ మీనాన్న. అలాంటి మహానుభావుడి శ్రాద్ధం మాఘనంగా చేయ్యాలోయ్...' అని యిలా మనిషోకలా తన్ను పీక్కుతింటుంటే కిష్టయ్యకు ఎక్కడలేని దుఃఖమూ పొంగిపొర్లేది. తండ్రిచావువలన కలిగిన దుఃఖంకన్నా, యీకర్మకాండంతా యెలా నెరవేర్చటమా అనేదే హెచ్చుదుఃఖాన్ని కలిగించి చిన్నపిల్లాడిమల్లే యింటిదగ్గర యేడ్చుకొంటూ కూర్చునేవాడు.

కథా నిలయం
546
శ్రీకాకుళం

మామగారు చనిపోయాక రుక్మిణమ్మ భర్తకు సంసారంగొడవ అంటకుండా చూడడానికి వీలైనంతవరకు ప్రయత్నించేది. కాని వీధిలోకి ఆమె యెలాపోగలుగుతుంది? యింట్లో బొగ్గులబస్తా ఆఖరు—బియ్యం కూడాను. డబ్బిచ్చినా కిష్టయ్యకు 'బజారుకు వెళ్లండి' అంటే చిరాకు. గొణుక్కుంటూ గొణుక్కుంటూ వెళ్లేవాడు. బేరం తెలిసేదికాదు. వాళ్లెంతంటే అంత. భర్తయెలాంటివస్తువులు తెచ్చినా రుక్మిణమ్మ పల్లెత్తు మాట ఆడేదికాదు. చాలా చౌకగా తెచ్చారే, అనేది. ఆయన మనసును చికాకుపరచడం ఆమెకుయిసుమంతైనా యిష్టంలేదు. పోనీ, కమలాన్నే బజారుకు పంపిస్తామంటే మనిషోమాటగా గొణుక్కుంటారని భయం. అంచేత కిష్టయ్యే బజారుకు పంపించవలసివచ్చేది. రామయ్య కమలానికి ఒక్క పెళ్లితప్ప, మిగతావిషయాల్లో ఏమీఅన్యాయం చెయ్యలేదు. థర్డుఫారంవరకు చదువు చెప్పించాడు; సంగీతం నేర్పించాడు. దేవుడిచ్చినఅందం ప్రకాశిస్తూనేవుంది. కమలం సుగుణవతి. వదినగారిమాట ఆమెకు వేదవాక్కు. ఆమెహృదయం అమృతభాండం.

రామయ్యగారు చనిపోయారని పరామర్శకు యితరప్రదేశాలనుంచివచ్చినచుట్టాలు రెండుమూడురోజులు పూర్వంలా తిష్ఠవేసేవారు- వీరందరినీ చూస్తుంటే కిష్టయ్యకు అసహ్యం. 'యిన్నాళ్ల వరకెందుకు? ప్రాణంలేక పోయావా?' అనిభార్యను గదమాయించేవాడు. కాని రుక్మిణమ్మ భర్తను మంచిమాటలతోనే శాంతింపజేసేది. వచ్చినవారు తిని వుత్తగాపోయేవారు కారు. నాలుగు నిందలు పరోక్షంగా మోపి మరీ యిల్లుకదిలేవారు. 'మామయ్యచావటం దీనికి యిష్టమేమో? మొగుడు

గోలపెట్టుంటే, యిది పెద్దగోలపెట్టదేం? రామయ్య కంఠమూసి వారంరోజులు కాలేదుగాని, యింట్లో బంధువులను యెంతనిరాదరణతో చూస్తున్నారు!' యిలా ఊరిలో, కులంవారిలో చాటుతూ పోయేవారు.

వుత్త చెంబుతో తిరిగివచ్చాడు కిష్టయ్య. చెంబునుక్రింద పడవేసి 'అయ్యో! రామా...' అంటూ మంచంపై చేరబడ్డాడు. 'పాలు దొరకలేదాండీ?' అని ప్రశ్నించిన రుక్మిణివేపు దీనంగా చూస్తూ 'ఇరవైరూపాయలు యివ్వాలటగా... ఆ డబ్బు యివ్వంది పాలెలా యిస్తుంది...?' అన్నాడు. భర్త నేత్రాలు అశ్రుపూరితాలు కావడం రుక్మిణమ్మ గమనించక పోలేదు. రుక్మిణి ఆచెంబు తీసుకొని వీధిలోకి వెళ్తుంటే వింతగా చూస్తున్నాడామెవేపు కిష్టయ్య.

'మీ రేనండీ కిష్టయ్యగారు—డాక్టరుగారు బిల్లుయిచ్చారు' అంటూ ఒకమనిషి గుమ్మందగ్గర నిలబడ్డాడు. వాడివేపు పెద్దకండ్లతో చూస్తున్నాడేగాని, యేం మాట్లాడాలో తోచిందికాదు. కమలం వంటయింటి గుమ్మందగ్గర నిలబడి ఇది చూస్తోంది. 'యేమండి మాట్లాడరు?' అని మరల ఆ మనిషి అన్నపలుకులు విన్న కమలం వడిగావచ్చి 'యేదిబాబూ ఆ బిల్లు...?' అంటూ తీసుకొని చూసి 'యాభై రూపాయలే!' అంది ఆశ్చర్యంగా అన్నయ్యవేపుచూసి. అంతలో రుక్మిణివచ్చి, విషయం తెలుసుకొని 'బాబూ, రేపు తప్పక యిచ్చేస్తామని చెప్పండి! అంటూ ఆయనను పంపించివేసింది.

'పాలెక్కడివి? నీళ్లపాలులా వున్నాయే...' అద్దాలలో

వేసి కొడుక్కి పాలుపడుతున్న రుక్మిణి వేపు చూస్తూ కిష్టయ్య అన్నాడు హీనస్వరంతో.

'పరిక్కయింటివారిని అడిగి తెచ్చాను. తల్లి ప్రేమతో పోస్తే నీళ్లయినా పాలకంటే హెచ్చుబలాన్ని యిస్తాయిలెండి'

'ఛీ! అయ్యోరకలవాళ్ల యింటి పాలెందుకు తెచ్చావ్?'

'కులస్థులమై మహాసుఖం అనుభవించాం! కులంతో యేం వుంది? కష్టకాలంలో తేరిచూసిన వారే కులంవారైతే నేం, మానవజాతే లెండి.'

ఈ మాటలువిన్న కిష్టయ్య ముఖం రెండోవేపుకు తిప్పాడు. కమలం ఆశ్చర్యం చెందింది—నిన్నటి వరకు అంత నిష్ఠానియమాలతోవున్న వదిన యిలా మాట్లాడిందేమని.

పిల్లాడు నిదరపోయాడు. వాడికి మంచంపై పడుకోబెట్టి భర్త వద్దకు వచ్చింది రుక్మిణి.

'యేమండీ! మీామనసును అనవసరంగా కష్టపెట్టుకోకండి. పుట్టించినవాడు ఆమాత్రం పెట్టకపోడు...'

'రుక్కూ! శార్ధం చెయ్యకపోతే...'

'యెంతమాట ఆడారండి...'

'యీామందలో తక్కువగా చేసుకోలేమే? వ్యవధికూడా లేదు. యింతకూ ఆతక్కువగానైనా చేసుకోడానికేమే ముందని?'

'నేనూ యీావిషయమై మాట్లాడుదామని వచ్చాను. నలుగురిలోనూ మనకాచిన్నతనం యెందుకు? నా గొలుసు తీసుకవెళ్లి యెక్కడనైనా ఒక మూాడు వందలకు తాకట్టుపె

ట్టండి. పాలవాడికి, డాక్టరుగారికి మిగతా, చిల్లరబాకీలకూకఒ వందపోగా మిగతా రెండువందలతో యెలాగో కానిద్దాం...'

'ఆగొలుసు తాకట్టుపెట్టితే వడ్డీపెరగడమేకాని లాభం లేదు. అమ్మి యిలా యీకార్యానికి తగలేస్తే కమలంపెండ్లి యెలాచేస్తాను? రుక్కూ! నామాటకు యిక అడ్డుపెట్టకు. ఆ గొలుసు యిలా తే. చెయ్యవలసిందేదో నేనే చేస్తానని గొలుసు తీసుకొని వీధిలోకి నడిచాడు కిష్టయ్య.

భర్త యిలాధైర్యంగా మెలగటంచూసి రుక్మిణి ఆశ్చ ర్యపోయింది. మామగారి ఆత్మఅనే వెలుగు యిలా ఆయన కా ధైర్యాన్ని ప్రసాదించి వుంటుందని నమ్మింది. కండ్లుమూసింది: మామయ్యగారిని ఆ చీకటిలో చూడగలిగింది. కన్నీరు చెక్కి ళ్ళమీదినుంచి కాలువలా ప్రవహించింది. తన తండ్రికన్నా హెచ్చుగా చూశారు మామయ్యగారు. అసలే అధైర్యానికి ఆహుతైన భర్తగారికి ధైర్యంచెప్పటానికని ఆమెగుండె రాయి చేసుకుంది. కాని అప్పుడప్పుడూ పరోక్షంగా కన్నీరు కార్చ కుండా వుండలేకపోయింది.

'వదినా!...' అన్న కమలంపలుకు చెవినిపడగానే చీర కొంగుతో వడిగా కన్నీటిని తుడిచివేసి వెనుతిరిగి 'ఏం కమలం—!' అంది.

'వదినా...'

'నీ అన్నయ్యను చూచి నీవుకూడా యేడుస్తూ కూర్చో కమ్మా. నా కెవరున్నారు? తల్లా, తండ్రా? అంతా మీరే కదా? యిద్దరం ధైర్యంగావుండి ఆయనను ధైర్యంగా వుంచాలి ...'

'వదినా! ఒకవిషయం చెప్దామని వచ్చాను...'

'చెప్పమ్మా, చెప్పు'

'మరేమీ లేదు, నా పెళ్లివిషయమై మీరు బెంగపెట్టుకోకండి. నాకు యెవరిని పెండ్లాడాలనిలేదు. ఏదైనా వుద్యోగం చేసి అన్నయ్యకు కాస్త సహాయం చేద్దామనివుంది...'

'అయ్యో! పిచ్చితల్లి! ఉద్యోగంచేస్తే యింకవీధిలో నడవనిస్తారా! యీవూర్లో ఉండనిస్తారా? ఇప్పుడు యింట్లోనైనా కూర్చుంటున్నావా? నిన్ను వంటయింట్లోనే మాడ్చేస్తున్నానని నాలో నేను కుమిలి, పోతూంటే—'

'వదినా మీరలా అనకోకండి. నాతల్లికంటే మీరు హెచ్చుగా చూస్తున్నారు...' ఇంకా యేదో మాట్లాడబోయింది కమలం. ఇంతలోకే శాస్త్రుర్లుగారు రావటంవలన ఆపవలసివచ్చింది.

'అవునమ్మా, ఇదేం బాగుందా? అంత మహానుభావుడికి మీరు పుట్టగతులు లేకుండా శాశ్వతనరకంలోకి పంపిస్తున్నారు!'

'బాబూ, మీమాటలు నాకర్థంకాలేదు.

'యెలా అవుతాయ్? కులంలో ఘనంగా బ్రతకాలా వద్దా? అమ్మాయికి పెళ్లిచెయ్యలేదని యిప్పటికే నలుగురూ వెక్కిరిస్తుంటే యీ వేషంకూడా యేమిటీ?'

'బాబూ, మీకాళ్లపై పడ్తాను ఆవిషయమేదో చెప్పనిది యెలా...'

'ఇంకేమిటి—అదే. శ్రీజగన్నాథంలో శ్రాద్ధంచేస్తే యెవడువస్తాడని? అక్కడ చెయ్యాడమేమిటీ? చచ్చినయింట్లోనే

చెయ్యాలని వేదాలు ఘోషిస్తుంటే! కిష్టయ్యకు మతిపోతే నీకూడా మతిపోయిందా అమ్మా!'

'శ్రీజగన్నాథంలో చేస్తానన్నారా? యెప్పుడు చెప్పారు మీతో?'

'ఇప్పుడే. బజారులో, ఆమాట విన్నాక నా శరీరం అంతా తేళ్లూ, జెర్రులూ పాకుతున్నాయ్. అంత గౌరవకుటుంబాన్ని డబ్బుకాశించి నాశనం చేస్తాడాఅని. ఒక్క యెనిమిది వందలరూపాయలైతే కుప్పలైపోతుంది. మీమామయ్యగారు పెద్దసిరస్తదారుపని చేశారనిమాత్రం మరచిపోకండి–'

బాబూ! యీవిషయంలో నేనేమీ మాట్లాడలేను. అంతా ఆయనయిష్టం—'

'అయ్యో! వెఱ్ఱితల్లీ! మొగుడుతప్పుచేస్తే దిద్దడానికి భార్యకు సర్వాధికారం వుందని శాస్త్రులు ఘోషిస్తుంటే...'

'బాబూ! మీకోనమస్కారం. మాఅన్నయ్య యెలా అంటే మేం అలానడపవలసినవారం. దయచేసి మమ్మల్ని కష్టపెట్టకండి' అని మధ్యను కలుగజేసుకొని సవినయంగా అంటున్న కమలంవేపు యెఱ్ఱగాచూస్తూ 'నీకూడానా...చూస్తారుగా. మీరెలా యీవూర్లో శ్రాద్ధం చెయ్యరో నేచూస్తాను. నాతడాఖా చూస్తారుగా!' అంటూ చేతికర్రను నేలమీదకొట్టి గుమ్మందాటాడు శాస్త్రుల్లు. రుక్మిణీ, కమలం ఒకరి ముఖం ఒకరు చూసుకున్నారు.

బజారునుంచి కిష్టయ్య వచ్చాడు. 'అమ్మాయీ! కాస్త మనసు కుదుటపడింది.' అన్నాడు భార్యవేపుచూస్తూ. 'రుక్కూ! ఇదిగో 553 రూపాయలు. గొలుసుఅమ్మివేశాను. ఈ గోము

ఖవ్యాఘ్రాలక్రింద డబ్బు తగలేసేబదులు శ్రీజగన్నాథంపోయి, అక్కడ పేదలకు నాన్నగారిపేరుచెప్పి యింత దానంచేస్తే ఆయన స్వర్గానికి పోతారు.'

'సంఘంలో బ్రతుకుతున్నాం. కమలం పెళ్లి చెయ్యవలసివుంది. ఆలోచించండి'

'ఈ డబ్బు వాళ్లకింద తగలేద్దామనా నీవుద్దేశం?'

'..........................'

'మాట్లాడవేం? యీడబ్బుతో పెళ్లికూడా చెయ్యొచ్చు.'

'పెండ్లి అంతతక్కువలో అయిపోతుందా?'

'రుక్కూ! అన్నిటికీ లోకానికి జడిసే యింతవరకూ తెచ్చాడు నాన్న. అన్నిటికీ పరోపకారం అంటూ ఘోషించే మమ్మల్ని తగలేశాడు. ఈ విషయంలో మరి యెదురు మాట్లాడకు—'

'మామయ్యగారిని దూషించకండి. ఆయన మహాత్ములు. ఆయనచేసిన పరోపకారమే అదేవుణ్యం— మనన్ను, మన తరతరాలవారిని రక్షిస్తుంది. అన్నీ మీకు తెలుసు. నేనేంచేస్తాను?'

డబ్బు భార్యచేతికిచ్చి వీధిలోకిపోయాడు కిష్టయ్య. అప్పకికప్పుడే శాస్త్రిలుగారు వీధిలో ఢంకామీద దెబ్బకొట్టి యీ విషయం చాటుతున్నారు. యీ శ్రాద్ధంలో అధమం రెండు వందల రూపాయలైనా గుంజుకుందా మనుకున్నాడు. కాని ఆయనఆశలు అడియాసలయ్యాయి. 'రామయ్యకడుపు చెడబుట్టా' డన్న దూషణాలు అప్పుడే రేగుతున్నాయి.

చిరాకుగా కిష్టయ్య యింటికి వచ్చాడు. భార్యతో మాట్లాడలేదు. పరుపుపై వాలాడు. రుక్మిణి చంటిపిల్లాడిని యెత్తు

కొని, భర్త యేం చెప్తారోఅని మంచందగ్గరగా నిలబడింది. అప్పుడే బడినుండివచ్చిన పదేండ్లు కుమార్తె సరళా, యేడేండ్లు కొడుకు రామం 'అమ్మా! రేపుమాకు శెలవే' అంటూవచ్చి అమ్మదగ్గర నిలబడ్డారు. రుక్మిణి పిల్లలను చేరదీసింది. అమ్మా, అమ్మా అంటూ నాలుగేండ్ల మోహనుడు కమలాన్ని విడిచి దగ్గరకు వచ్చాడు. నలుగురుపిల్లలనూ, వదిననూ వంటయింటి గుమ్మందగ్గరే నిలబడి చూస్తూ కమలం మురిసిపోయింది. దుఃఖాన్ని మరిచిపోయింది.

'నాన్న పడుకున్నారేం అమ్మా?' అని సరళ అడిగింది.

'అమ్మా, అమ్మా! తాతయ్య యెప్పుడువస్తాడే' అంటూ యేండేళ్ల రామం అమ్మముఖంవేపు చూస్తూ అడిగాడు.

కొడుకు మాటలనువిన్న కిష్టయ్య పూరుకోలేక మంచం దిగి మోహనుని ఎత్తుకొని ముద్దాడి రామాన్ని చేరదీశాడు. 'అమ్మా! కమలం! కాసిన్ని మంచినీళ్లీయమ్మా' అని కేకవేశాడు. కమలం మంచినీళ్లు తెచ్చింది. తాగి 'అమ్మయ్యా!' అన్నాడు.

'రుక్కూ! శ్రీజగన్నాథానికి రేపేప్రయాణం. యిచ్చట యింకావుంటే వీళ్లేమైనా చేస్తారు. రైలుబండి నడవకుండా చేస్తారేమో అని భయంగావుంది'

'అయితే, వెళ్లటానికే నిశ్చయించారా! ఆ మాత్రం పొదుపుగా యిక్కడే చేసుకుంటే!'

'సరే, మొదటికేవచ్చాక? రెండువందలు శాస్త్రుల్లగారికీ, అయిదువందలు శ్రాద్ధభోజనానికీ ఖర్చుపెట్టానా చెప్పు—నాకేం అభ్యంతరం లేదు. వీళ్లంతా మనం పాడైపోతే చూస్తూ

నవ్వుతా రేగాని ఒక్కదమ్మిడి యెవడిస్తాడు! మోపరులకు యాభైరూపాయలిస్తేగాని శవం కదలలేదు చచ్చినవారి ఆత్మ శాంతికి వారుచూపించిన మార్గాన్ని అనుసరిస్తే చాలు. పంచ భక్ష్యపరమాన్నాలతో యీధనవంతుల బొజ్జలు నింపేబదులు మలమలమాడే పేదవాని కడుపుకు గంజిపోస్తే నాన్నఆత్మ శాంతిస్తుందిలే...' అన్న కిష్టయ్యమాటలు విన్నాక రుక్మిణి మరి మాట్లాడలేక పోయింది. ఆరోజుసాయంత్రం పాలవాడికీ, డాక్టరుగారికీ ఇవ్వవలసిందీ, మిగతా చిల్లర బాకీలూ తీర్చి వేసింది.

పొరుగింటి ఆయన కులంచేత అయ్యారకలవాడు కాని వారి యిల్లు చాలా శుభ్రంగా వుంటుంది. ఆయన డివిజినల్ ఆఫీసులో గుమస్తాగా పనిచేస్తున్నాడు. ఆయనభార్యతో రుక్మిణి 'యింటిని చూస్తుండ' మని చెప్పినమీదట తెల్లారగట్ల నాలు గ్గంటలకు పూరీపోయే ప్యాసిజరులో అంతా బయలుదేరారు.

రెండువందలతో శ్రాద్ధంచెయ్యటం అయిపోయిందని కిష్టయ్య సంతోషించాడు. యింకా రెండువందలకు పైగా వున్నాయి. అవి జాగ్రత్తగావుంచి నెల నెల కేమైనా జీతంలో మిగలేసి ఒక పేదయింట్లోనైనా చెల్లెమ్మను పడవేస్తా నను కున్నాడు.

౨

పూరీనుంచి తిరిగివచ్చేటప్పుడు పూరీలో మనిషోమాట, మనిషోకూత! శాస్త్రిలు తిరగవేస్తున్నారు—కిష్టయ్య జగన్నాథం వెళ్లిననాటనుంచీ, 'పీడిక జాతిలోనుంచి వెలివెయ్యావలసిందే' అని శాస్త్రుల్లుగారు పట్టుపట్టారు.

వూరి ఆడంగులు యెవరువచ్చి యేమన్నా రుక్మిణమ్మ మౌనం దాల్చేది. చుట్టాలు రావటంమాత్రం తగ్గలేదు. వచ్చి రెండేసి మూడేసి రోజులకు తక్కువకాకుండా మకాంవేసి, కడుపునిండా తిని, నాలుగు నిష్ఠూరాలు విడిచిపెట్టి పోవటమూ జరుగుతున్నది. ఉన్నడబ్బులో యీ ఖైరూపాయలవరకూ భర్తకు తెలియకుండానే రుక్మిణి ఖర్చుపెట్టింది. 'వారందరూ యింకా మన సంసారాన్ని నాశనము చెయ్యాలనే! పొమ్మనలేక పోయావా?' అని అప్పుడప్పుడు రుక్మిణిని మందలించేవాడు. చుట్టాలను యెలా పొమ్మన గలుగుతుంది? భర్తకోపాన్ని శాంతి వచనాలతో చల్లార్చటానికి ప్రయత్నించేది రుక్మిణి.

శాస్త్రిర్లుగారి ప్రచారమూ, పోటీలూ, రాను రాను హెచ్చుపోతున్నాయి. 'చెల్లెలికి వీడుపెండ్లిచేసి యేడ్చాడు! దానిబుద్ధి మంచిదై తేగా...!' ఇలా విషబీజాలు సంఘంలో కిష్టయ్యకుటుంబంమీద నాటడమే ఆయన విధిగా ఎంచుకున్నాడు. ఆఫీసులో తనతోడి గుమాస్తాలు కొందరు దెప్పిపొడిచేవారు. దానికి తగ్గట్టు పనికూడా హెచ్చుగానే ఉండేది. వీధివెంబడి తలెత్తి నడవటానికి భయం. కొందరు ఆయనను చూచి తుప్పుమని క్రింద వుమ్మువూసేవారు, కోపం వచ్చేది. కాని యేం చేస్తాడు? కాస్సేపు ఆవిషయం తలచుకొని విచారించేవాడు. తానుచేసింది మంచిపనేఅని సంతృప్తిపడి ప్రజల నిరాదరణను మరచిపోడానికి ప్రయత్నించేవాడు. ఒక్కొక్కసారి యెవరైనా తనవిషయాల్లో అనవసరప్రస్తావన తెస్తే కోపం వచ్చి, వారిని నాలుగు చీవాట్లు పెట్టేవాడు; నాలుగుతినేవాడు. చికాకుతోనైనా ఆఫీసుపని చెయ్యక విధిలేదు. చేస్తే తప్పులు

వచ్చేవి. ఆఫీసరుపెట్టే చీవాట్లుకూడా తినవలసివచ్చేది. ఇంటికి పెద్దఫైళ్లకట్ట మోసుకొనివచ్చేవాడు. పనిచెయ్యటానికి విసుగు పుట్టేది. ఆయన తలలో తిరిగేది కమలానికి యెంత వేగంగా పెండ్లిచేసి సుఖద్దామనే. ఆఫీసులోపని, యింట్లో సంసారం గొడవ, కమలంపెండ్లికోసం తిరగటం, వూరిలో కులంవారు కురిపిస్తున్న దూషణలు భరించటం—ఇవి ఆయనకు విసుగు కలిగించేవి, విసుగుతో కోపంకూడాను. కిష్టయ్య సంసారపు గొడవ తాకకుండా చేయటానికి రుక్మిణి వీలైనంతవరకు ప్రయత్నించేది.

ఆరోజు ఆఫీసునుంచి చిరాకుతో వచ్చాడు, నాన్నా, నాన్నా అంటూ పిల్లలు ముగ్గురూ చుట్టూమూగారు, ఆఫైళ్ళ కట్ట టేబిలుపైన పారేసి 'అమ్మయ్యా!'' అంటూ చాపమీద కూర్చుండబడిపోయాడు. రుక్మిణివచ్చింది. 'రుక్కూ! అగ్రికులంలో యెందుకు పుట్టాం?' అన్న భర్తమాటలు విన్న రుక్మిణి 'మీరు విచారించకండి. ధైర్యంతోవుంటే యేకార్యమైనా నెరవేర్చగలుగుతాం!' అని ఓదార్చింది.

'రుక్కూ! పేదవాళ్లకు కూడానూ కట్నాలపిచ్చేనే! పోనీ, ఈవూరినుంచి పోదామూ అంటే ఆవెధవ బదిలీచెయ్యడు!'

'తప్పు. ఒకరిని తిట్టడమెందుకు? కమలంపెండ్లిగూర్చి మీమనసు కష్టపెట్టుకోకండి. ఎవరినీ పెండ్లాడదట.'

'రుక్కూ! నీకూ మతిపోయిందా? మన యీస్థితినిజూచి వద్దనక యేమంటుంది?'

రుక్మిణి 'నిజమే' అన్నట్లు మౌనాన్ని సూచించింది. రాఘవయ్యగారి కూతురు పెండ్లికి అందరినీ పిలిచారటగా—

మనలను తప్పించి!' అన్నాడుకిష్టయ్య. 'పోనీలెండి' అని సమాధానమిచ్చిన రుక్మిణివేపు చూస్తూ 'కమలం పెళ్లి చెయ్యాలి, నేను నిద్రపోవాలి రుకూ! మనకు డబ్బు అధికం ఖర్చుకాదు. వీళ్లెవరినీ పెండ్లికి పిలువవవసరంలేదుకదూ!' అన్నాడు.

ఆమరుచటిరోజు ఆఫీసరుచేత పడచీవాట్లు తిన్నాడు. ఆ ముందురోజు పోవలసిన ఆఫీసుకాగితాలు పంపలేకపోయాడు. ఇంట్లో పనిచెయ్యాలని కొన్నిఫైళ్లుతీసుక వెళ్లేవాడు. కాని కమలాన్ని చూడడంతోనే దుఃఖం ముందుకువచ్చి కాగితం ముట్టలేకపోయేవాడు ఆఫీసులో తోడిగుమస్తాలు కొందరు ఆయనను వెలివేసినట్లుంచారు.

ఆరోజే కమలంపెండ్లిచూపులకు యెవరో వస్తానన్నవారు రాలేదు. కిష్టయ్యగుండె కుంగిపోయింది. పూరంతాగోల_ పిల్లగుణాలు మంచివికావనీ, అదీకాకుండా కిష్టయ్యని కులంనుంచి వెలివేస్తే ఆపిల్లను యెవరు పెండ్లాడుతారనీ. పిల్లగుణాలు మంచివికావని నలుగురూ అనుకుంటున్నమాటలు పరోక్షంగా విన్న కిష్టయ్య గుండె బాదుకొని చిన్నపిల్లాడిమల్లే యేడ్చాడు. లోకంమీద వర్ణించలేని అసహ్యం పుట్టింది. సుగుణవతియైన తన చెల్లెలిని లోకం ఆలాదూషిస్తుందంటే ఆపాడులోకంలో బ్రతికేబదులు చావాలనిపించింది కిష్టయ్యకు. 'యెవరో కిట్టనివాళ్లు ఆడేమాటలు తీసుకోకండి. మీచెల్లెలు మిమ్మల్నిచూసి యేడుస్తోంది పెండ్లి ససేమిరా వద్దంటోంది. పిల్లలుకూడా యేడుస్తున్నారు. కులంలేకపోతే పోయె. ధైర్యంగా ధర్మంగా మనంపోతేచాలు...' అని రుక్మిణి యెన్నోవిధాల ఓదార్చింది.

ఆరాత్రికి భోజనం చెయ్యలేదు. పరుపుపైన పడుకొని ఆరాత్రింతా కమలం పెండ్లివిషయమే పలవరించాడు.

తెల్లవారింది. 'ఆఫీసులో కట్టలుకట్టలు పడివున్నాయి. యే బాబుకూ సహాయం చేద్దామని దయలేదు— వెళ్తానంటూ, స్నానంచేసి కాఫీతాగేక ఆఫీసుకు పోవడానికి బయలుదేరాడు. 'సరళను కేరియరుతో పంపిస్తా పదిగంటల' కంది రుక్మిణి. 'హోటలులో భోంచేస్తాను. అమ్మాయి బడికిపోనీ' అంటూ గుమ్మం దాటాడు.

చీకటిపడింది. భర్తయింకా ఆఫీసునుంచి రానందున రుక్మిణి ఆందోళన చెందింది. ఆవీధిలో నేవున్న ఒక తాలూకాఫీసు గుమస్తాగారి యింటికి సరళను పంపింది. ఆఫీసు సాయంత్రం అయిదుగంటలకే విడిచిపెట్టినట్లు తెలుసుకొని మరీ ఆందోళన చెంది, భర్తరాకకోసం వీధిగుమ్మందగ్గర చంటిపిల్లాడిని యెత్తుకొని నిరీక్షిస్తోంది. 'అమ్మా, నాన్నయింకా రాలేదేమే' అని యేకకంఠంతో రామమూ, మోహనుడూ అడుగుతున్నారు. !

రాత్రి యెనిమిదిగంటలకు వచ్చాడు కిష్టయ్య. 'రుక్మా యెంతసేపటినుంచి అలా కాచుకు కూర్చున్నావ్??

'చాలాసేపైంది. యీరోజు యింత ఆలస్యంగా వచ్చారేమండీ? పిల్లలు మీకోసం పలవరిస్తున్నారు'

'జగన్నాధస్వామి కోవెలలో యెవరో వేదాంతం చెప్తున్నారు. యేమిటో విందామని ఒకాయన పిలిస్తే వెళ్లాను.'

'వేదాంతబోధ అప్పుడే మనకెందుకండీ!'

'అందులో తప్పేముందే? చాలా కమ్మగావుంది!'

భోజనం చేస్తూ అన్నాడు—'రుక్కూ! యీసంసారమంతా సంతలోని ఒక వ్యాపారంలాంటిది సుమా! చూడు, యీగ్లాసు యీనీటితో అలా బైటపెట్టు. అందులో ఆకాశం కనిపిస్తుందా లేదా? నీరు పారవెయ్—యేమవుతుంది?'

'యేమిటండీ యీ వేదాంతం? మీకు పుణ్యం వుంటుంది. రేపటినుంచి వెళ్లకండి.'

'రుక్కూ! తప్పేముందే? నిన్నంతటి దిగులు యీవేళ లేదు, చూశావా? నేను కాస్త ధైర్యంగా వుండి వుద్యోగం చెయ్యాలంటావా?'

రుక్మిణి భర్తకు జవాబివ్వలేదు. ఆరాత్రి స్వేఛ్ఛగా నిద్ర పోయాడు కిష్టయ్య. తెల వారింది. పరుపుమీద కూర్చున్ని కిటికీగుండా ఆకాశం వేపు చూస్తున్నాడు 'యేమిటండి అంత దీక్షగా చూస్తున్నారు?' అంది రుక్మిణి. 'కమలంపెండ్లి యెలా చేయ్యటమా అని. మనలను యేశుభకార్యాలకూ యెవరూ పిలువలేదు. కులంలోనుంచి వెలివేశామని చాటుతున్నారు పూరూరా. మనవుసురు ఆశాస్త్రిగాడికి యెలాతగుల్తుందో...' అంటూనే బొటబొట కన్నీరుకార్చేశాడు. ధైర్యాన్ని తెచ్చుకోమని రుక్మిణి యెన్నోమాటలు చెప్పింది. ఈదృశ్యాన్నిచూచిన కమలంవచ్చి 'అన్నయ్యా, నాపెండ్లివిషయమై నీవు విచారిస్తే నీ యింట్లో నేను వుండలేను' అంది. రుక్మిణి ఆశ్చర్యపడింది. కమలం అంతధైర్యంగా నిలబడి యిదివర కెప్పుడూ అన్నయ్యతో మాట్లాడలేదు.

ఆరోజు ఆఫీసుకుపోతూ 'నేను రావటం ఆలస్యమౌతుంది. బెంగపెట్టుకోకండి' అంటూ రుక్కుతో చెప్పి పోయాడు. ఆ

రాత్రి వేదాంతబోధవిని వచ్చి భోజనంచేస్తూ, 'రుక్కూ! యెవ రైనా చస్తే యేడవటమంత తెలివితక్కువ యింకేమీలేదు. ప్రపంచంలో ఒక్కమనిషి చావకుండా ఒక్కనిమిషం గడుస్తుందా? ఆచావులన్నిటికీ యేడిస్తే మనకన్నీరు యెప్పటికీ ఆరదు. ఆత్మకు చావులేదని తెలుసుకున్నవాడు చావుకుజడిస్తే వాడేమతంవాడైనా యేంలాభం? మాసినచింకిబట్టలను విడిచిపెట్టి కొత్తబట్టలు వేసుకోవటం మంచిదా కాదా?' అంటూ లేచి చెయ్యి కడుక్కున్నాడు.

నిద్రలో యీవేదాంతమంతా మరిచిపోయాడు. నడిరాత్రప్పుడు తెలివివచ్చింది. లేచి, 'రుక్కూ! రుక్కూ! నా మనస్సు ఆదోలావుంది. ఉద్యోగం వదిలేసి ఏ ఊరైనాపోతే యీపోరంటూ వుండదు. అక్కడ కమలానికి పెండ్లి చెయ్యొచ్చు' అన్నాడు, రుక్మిణి నిద్రపోతోంది. వీధితలుపులు తెరిచాడు. యిటూ అటూ చూశాడు. వీధిలోకివచ్చి, రోడ్డుమీద కొంతదూరం ముందుకు సాగాడు. మళ్లా వెనుతిరిగి చూశాడు. తనభార్యా, పిల్లలూ, కమలం యేడుస్తున్నట్లు కనిపించింది 'నేనున్నాను యెక్కడికీ వెళ్లిపోలేదు'. అని గొణుక్కుంటూ యింటికిపోయాడు. తలుపు లోగడియ వేస్తున్నాడు. రుక్మిణికి తెలివివచ్చింది. 'యెక్కడికి వెళ్లారీ నిశిరాత్రప్పు' డంది. 'రుక్కూ! కమలంపెండ్లి చేస్తేనేగాని నేను మనిషిని కాను...' అన్న భర్తపలుకులువిని 'మీరిలా అధైర్యంచెందితే మాగతేంగాను? మామయ్యగారిని తలచుకోండి. ఆయన చూపిన త్రోవలో నడుచుకోకపోతే యెలా?' అని అంది.

'అవునుగాని, రుక్కూ! చుట్టాలక్రింద యేమాత్రం డబ్బయింది...?'

'యేమాత్రమైతే యేం లెండి? యింక చుట్టాలు మన యింటికి రమ్మన్నా వస్తారా?

'రుక్కూ-యీజీతంఅంతా ఒక కల. కలచూసి మురిసి పోతా మెందుకో' అన్న భర్తమాట విని రుక్మిణి గజగజ వణికి పోయింది. భర్తమార్పుకు విచారించింది. 'రోజంతా పనిచేశావ్, పడుకో రుక్కూ!' అంటూ పరుపుపై వాలిపో యాడు. కండ్లుమూసి దేవుని ప్రార్థించుకొంది. మామగారిని తలచుకొంది.

వేదాంతోపన్యాసం వినటానికి వెళ్లటం రుక్మిణి యెంత బ్రతిమాలినా కిష్టయ్య మాన లేదు. రానురానూ వుద్యోగం మీద శ్రద్ధకూడా పోయింది. ఒక నెలరోజులు ఆఫీసుకు శలవు పెట్టాడు. ఒక్కొక్కసారి యింట్లో చుట్టములా మెసిలేవాడు.

ఆనాడు ఆదివారం. తనతో సరిగ్గా మధ్యాహ్నం పండ్రెండుగంటలకు యిద్దరుసాధుపులను తెచ్చి 'రుక్కూ, వీరికి అన్నం పెట్టు' అన్నాడు. రుక్మిణి వారికి అన్నంపెట్టింది. వారు భోజనం చేస్తున్నారు. రుక్మిణివైపు చూసి నవ్వుతూ కిష్టయ్య అన్నాడు — 'రుక్కూ! నాన్న ఒకసారి నీతో ఏమన్నారు? జ్ఞాపక ముందా? నేను వీధిఅరుగుమీద నుంచొని విన్నానులే...' 'యేమన్నారండీ!'

'అమ్మా, కిష్టయ్య సన్యాసిలాంటివాడే. సంసారంగొడవే అవసరంలేదు. నా వూపిరి కాస్తాపోతే యీ చుట్టాలతో మరి

పడలేదు. అన్నిటికీ ధైర్యమైన యిల్లాలివి నువ్వున్నావులే అమ్మా!—ఆమాటలు జ్ఞాపకం లేదూ 'రుక్కూ?'

'ఉన్నాయిలెండి. మీరు భోజనానికి లేవండి' అంటూ రుక్మిణి అక్కడినుంచి లేచిపోయింది.

కిష్టయ్య రోజూ యెవరో సాధువులను భోజనానికి తెచ్చేవాడు. రుక్మిణమ్మ కాదనలేకపోయేది, ఆమెను బంధుజనాదరణ, అతిథి సత్కారాల్లో అందెవేసిన చేయిగా తయారుచేశాడు రామయ్య.

ఒకరోజు తెల్లారుఝామున లేచాడు. 'రుక్కూ! ఒక పనిమీద అనకాపల్లి వెళ్లాలి...' బట్టలేసుకున్నాడు అనుకోకుండా భర్తయీప్రయాణానికి అంతట్లోనేసిద్ధమవటం ఆమెను కలవరపరచి నేను మీతో వస్తానంది. 'యెందుకు? సాయంత్రానికి వచ్చేస్తా' నని బయలుదేరాడు. రుక్మిణమ్మ అరుగుమీద నిలబడిచూస్తూ అప్రయత్నంగా కన్నీటిబొట్లురాల్చింది.

ఒక్కఅరగంటలో కిష్టయ్య మరల తిరిగివచ్చాడు. 'ఏం? అప్పుడే వచ్చేశారు?' అంది రుక్మిణి. 'నేను వుండటం నీ కిష్టం లేదా?' అని భార్యవేపు చూస్తూ కిష్టయ్య అంటుంటే ఆమె దిగ్భ్రాంతి చెందింది. అలాంటి కఠోరమైన మాటలు వినటం అదే మొదటిసారి.

పడుకున్న మోహనుణ్ని లేపి ముద్దులాడాడు చంటిపిల్లాడితో కాస్సేపు ఆడుకున్నాడు. సరళా, రామంలకు కొంతసేపు చదువు చెప్పాడు. కమలంవేపు తదేకదీక్షతో కొన్ని నిమిషాలు చూచాడు. కండ్లవెంబడి కన్నీటిబిందువులు రాలాయి. గబగబా తుడుచుకున్నాడు. వారంరోజులుగా కమలాన్ని

మంచినీరు అడగటంమే మానివేశాడు. కమలం అన్నయ్య మార్పుకు దుఃఖించింది.

ఆ మూడవరోజున బజారునుంచి కాషాయివస్త్రాలు తీసుకవచ్చాడు. 'యివి మన కెందుకండీ?' అన్న రుక్మిణితో 'కాషాయవస్త్రాలు పవిత్రమైనవి మనయింట్లో ఒకమూల వుంటే తప్పా?' అన్నాడు.

ఈ సంఘటన జరిగిన పదిరోజులవరకు కిష్టయ్య రోజుకు అధమం నలుగురు బైరాగులను భోజనానికి తీసుక వచ్చేవాడు. గృహలక్ష్మి రుక్మిణి భర్తకు సంసారభారం తగలకుండా చూసేది. సిగ్గువిడిచి వీధిలోకి వెళ్లి అన్నివస్తువులూ ఆమె తెచ్చుకొనేది కిష్టయ్యకు మొదటిరోజులలో కాస్త కష్టమని పించినా, తరువాత తనఅశక్తిని తలచుకొని పూరుకున్నాడు. పూర్వంలో కొందరాడంగు లీ విషయమై గొణుక్కోకపోలేదు.

3

ఆరోజు మంగళవారం. కోడికూసింది. చంటిపిల్లాడు కావురమని యేడుస్తున్నాడు. గాఢనిద్ర చెందిన రుక్మిణికి తెలివి వచ్చింది. పరుపుమీద కిష్టయ్యలేడు. కేకలు వేసి పిలిచింది. సమాధానంలేదు. స్టాండులో కాషాయవస్త్రాలులేవు స్టేషను వేపు పరుగెత్తింది. రైలుఅప్పుడే వెళ్లిపోయింది. వదిన వెఱ్ఱి దానిలా పరుగెత్తిపోవడం చూచి కమల నిర్ఘాంతపోయింది. చంటిపిల్లాడిని యెత్తుకొని కన్నీటితో ఓదారుస్తోంది.

తెల్లవారింది. రుక్మిణి యింట్లో కాలుపెట్టింది. వరదలై పారుతున్న కమలం కన్నీటిని చూసింది. 'అమ్మా, కమలం' అంటూ కమలాన్ని పట్టుకొని యేడ్చింది. నిద్రపోతున్న పిల్లల

సందరినీ లేపి తనచుట్టూ కూర్చోబెట్టుకొని యేడ్చింది. వదిన యేడుపుతో కమలం యేడుపు మరీ హెచ్చయింది. యిరుగు పొరుగువారంతా వచ్చారు, యేమైంది— యేమయిందని. యేమని యెవరు చెప్తారు? శాస్త్రులుగారు ఆతొందరపడి పోతూ దయచేశారు. 'అయ్యిందీ? అనుకున్నంత పనీ అయ్యిందీ? శాస్త్రాలకు వ్యతిరిక్తంగా నడిస్తే సంసారి సన్యాసికాక యేమౌతాడు? నేనెంతగుండె బాదుకొని చెప్పాను? నామాటలు విన్నావా రుక్మిణీ......!' అంటూ గబగబా గుమ్మందిగాడు. యీపలుకులు ఆమెహృదయంలో ములుకుల్లా నాటాయి.

'అమ్మా? కిష్టయ్య ఉత్త అమాయకుడు, సంసారంచెయ్యలేడు. అన్నిటికీ నువ్వే వున్నావు. సత్యం, శాంతి, సహనాలతో మెలగి ధర్మంగా నువ్వు నీవిధిని నిర్వర్తించావంటే యేకష్టాలైనా సుఖంక్రిందే భావిస్తావు. భగవంతుడొకడున్నాడనీ, ధర్మమే ఆయన స్వరూపమనీ గుర్తించుతల్లీ. కష్టం, సుఖంరెండూ అనుభవించందీ యెవరిజీవితమూ పరిపూర్ణంకాదు. నిస్పృహానువిడిచిపెట్టి నీఆత్మయందు విశ్వాసంవుంచి నిష్కల్మషమైన మనస్సుతో నీ కార్యాన్ని నెరవేర్చు. జయంపొందుతావమ్మా...'
—చనిపోయేముందు మామగారన్న యీపలుకులు ఆమెచెవులలో మారుమోగాయి.

పిల్లలవేపూ, కమలంవేపూ ఒకసారి చూసింది. వారి రోదన ఆమె హృదయాన్ని కలవరపరచింది. నిలబడి చీరకొంగుతో కన్నీటిని తుడుచుకొని కమలందగ్గరకు వెళ్లి, అంది—
'కమలం! నువ్విలా అధైర్యంగా యేడ్చుకొంటూ కూర్చోవద్దు. నా ఆశలన్నీ నీమీదే పెట్టుకున్నా. నీమూలంగా మీఅన్నయ్య

సన్యాసుల్లో కలిసిపోలేదు. కర్మఫలితాన్ని ఆయన అనుభవించక తప్పలేదు!' కమలం యేడ్చుకుంటూ వదిన పాదాలపై పడిపోయింది. కమలాన్ని లేవదీసి—'అమ్మా! నువ్వు ధైర్యముగా వుంటేనే యీపిల్లల బ్రతుకూ, నా బ్రతుకూను. కానున్నది కాకమానదు. ధైర్యంగా, ధర్మంగా పోతే యెప్పటికైనా మీ అన్నయ్య మనలను కలుసుకుంటారు. మామయ్యగారు చనిపోతూ నాతో అన్న సుభాషితాలను జ్ఞాపకానికి తెచ్చుకో అమ్మా. మనకు చంచలలక్ష్మికంటె శాశ్వత ధర్మమార్గాన్ని చూపించి మీనాన్న చనిపోయారు. అదే మనకు పదివేలు.' వదిన మాటవిన్న కమలం ఆమెవేపు చూచింది ఆమెచూపుల్లో ధైర్యం గోచరించింది. యేడుస్తున్న మోహనుని తీసుకొని ఓదార్చింది.

పరామర్శకు వచ్చేవాళ్లు వస్తున్నారు; కాని అభిమానంచేత కాదు. మెత్తిపొడుద్దామని. నిర్మోహమాటంగానే, యెదురుగా అనవలసిన గట్టిమాటలు అనేశారు. వేయవలసిన నిష్ఠురాలు వేశారు. వదినను పైవారు దూషిస్తుంటే కమలానికి కష్టమనిపించింది. 'శాంతం భూషణం! తొందరపడి యెదురుమాట చెప్పకమ్మా' అని కమలాన్ని ఓదార్చిది రుక్మిణి.

'మొగుడు బైరాగుల్లో కలిసిపోతే యేడ్చి చావలసింది; అలాంటిది యేమిటమ్మా ఆ ధీమా ఆరుక్మిణికి! దీని పోరూ, గతిలేక స్వర్గానికి పోలేక కాకికడుపులో ఉన్న రామయ్యశాపమూ మొత్తంమీద శాంతమూర్తి కష్టయ్యని బైరాగుల్లో కలిపేసింది. దానిమాటవినే జగన్నాథంలో శ్రాద్ధంచేశాడు' అని యెవరికి తోచినట్లు వారు మాటాడేవారు.

చీకటిపడింది. మధ్యాహ్నమనగా యిల్లువిడిచిన రుక్మిణి 'యిల్లుదొరికిందమ్మా, కమలం' అంటూ యిట్లోకివచ్చింది.

'యేవీధిలో వదినా?'

'పేద వారికీ హృదయం వుందమ్మా. వారిగుడిసెలమధ్య మనగుడిసె; వారిలో ఒకరం మనం.'

'కొత్త యింట్లోకి యెప్పుడు పోవాలి వదినా?'

'రేపే, నీకు చాలాశ్రమయిస్తున్నానమ్మా. నువ్వుశ్రమ అనుకోకు. యీపిల్లలని రక్షించేపూచీ నీకేవదిలిపెట్టున్నా'

'.........................'

'అలా తల దించావేమమ్మా? నేను సన్యాసినిఅయిపోతానా? నాగుండెను మామయ్యగారు తమ బోధనలతో కాస్త దిట్టంగా తయారుచేశారు. నాచేతనైన పని మీఅందరికీ వండి పెట్టడం. నువ్వు పరియివేట్లు చెప్పి డబ్బుతేవాలమ్మా.'

'పరియివేట్లు సంపాదించట మెలావదినా? వీళ్లంతాఅడ్డు పెడ్తారేమో?'

'పేదలకు హృదయముందని చెప్పలేదా? పదిమంది పిల్లలు మనయింటికే పరియివేటుకు వస్తారు. నెలకో పదిరూపాయలు వస్తాయి. ఆపక్కవీధిలో నలుగురు నాయుళ్ల అమ్మాయిలకు సంగీతంచెప్పితే వారునెలకోపదిరూపాయలు యిస్తారు. ఆ యిరవై రూపాయలతో యెలాగో సంసారాన్ని గడపగలమనే నాధైర్యం.'

మర్నాడు సామానులన్నీ క్రొత్తయింట్లోకి నడిపారు. అక్కడే బాగుంది వా జీవితం. వారిమధ్య గౌరవంగా బతుకుతున్నారు. పిల్లలు బడికివెళ్లివస్తున్నారు. కమలం పరియి

వేటులు జాగ్రత్తగా చెప్పుతోంది. రుక్మిణి తీరుబడి వున్నప్పుడల్లా యిరుగుపొరుగుపిల్లల బట్టలు, స్త్రీలజాకెట్లూ చేతికుట్టుతో కుట్టేది. కమలం వీధిలోకి వెళ్ళవలసిన మనిషని దగ్గర వున్నడబ్బులో పాతికరూపాయ లిచ్చి మొదటే చీరలూ, జాకెట్లూ కొంది.

౪

అయిదు నెలలు గడిచాయి. రుక్మిణి అప్పుడప్పుడు భర్తను తలచుకొని యేడ్చేది. కాని పిల్లలూ, కమలం యెక్కడ అధైర్యపడతారో అని ఆదుఃఖాన్ని వేగంగా ఆపుకొనేది దేవుని నమ్మింది. ఆయనను పూజించేది. కమలం తన శాయశక్తులా కష్టపడుతోంది. ఆమె శాంతగుణం, ఆమె తియ్యని పలుకులు, ఆమెఅందం యెదుటవారి హృదయాలను ఆకర్షించేవి. రోజుకు అధమం పదిగంటలైనా ప్రయివేట్లు చెప్పడంతో గడుపుతోంది. కమలం నలుగురిపిల్లలనూ తనప్రాణంకంటే హెచ్చుగా చూచుకొంటోంది. ఆ నలుగురు పిల్లలతోనే ఆమె కానందం. వారితోనే తన జీవితమని మురిసిపోతుంది.

అన్నయ్యకోసం విచారించకపోలేదు. కాని వదిన యెక్కడ విచారిస్తుందో అని ఆమెయెదురుగా యెప్పుడూ దుఃఖించలేదు. అప్పుడప్పుడు వదిన యెదురుగా ధైర్యమైన మాటలు చెప్తుండేది. కమలం నెలనెలకూ తెస్తున్న నలభై రూపాయలలో వారికి నెలకు పదిరూపాయలవరకు మిగిలేది. నాన్నకోసం మొదట రెండు మూడు నెలలవరకు పిల్లలు పలవరించారు. కమలం, రుక్మిణీ వాళ్లను ఆటలలోను, పాటలలోను, చదువులోను పెట్టి రానురాను తండ్రిని మరిపింపజేశారు.

ఆరోజు సంగీతం చెప్పడానికి వెళ్ళిన కమలం వేగంగా వచ్చేసి యింట్లో ఒకమూల కూర్చొని ఒక పుస్తకం చాటు పెట్టుకొని కన్నీరు కారుస్తోంది. రుక్మిణి పెట్టెలోని బట్టలుతీయ డానికి వచ్చి యీదృశ్యాన్ని చూచి కమలాన్ని చేరదీసి అంది: 'యేమమ్మా కమలం...అలా?'

'యేమీ లేదు వదినా' అని వేగంగా కన్నీరు తుడుచు కుంది.

'చెప్పు తల్లీ! నాదగ్గర......'

'వాళ్ళంతా యిప్పటికి మనలను బ్రతకనిచ్చేటట్లులేదు'

'యేమైంది? యెవ రేమన్నారు?'

'యిన్నాళ్లూ యెవ రేమన్నా వూరుకొనేదాన్ని. ఈ రోజు శాస్త్రుల్లుగారు రోడ్డుమీద నిలబెట్టి నేనెవరితోనో తిరుగుతున్నానని నోటికొచ్చినట్లు కూస్తే అందరూ మూగి నన్నొక వింతమనిషిలా చూశారు'

'అయ్యో! నాపిచ్చితల్లీ. అందుకేనా! యే కఱ్ఱిలో అగ్గి వుంటే అదే కాలుతుంది. నీధర్మాన్ని నువ్వునిర్వర్తిస్తున్నావు. లోకం యెలా అనుకుంటే నీకేం?'

ఇంతలో పిల్లలు బడినుంచి వచ్చారు. సరళ అంది—'అమ్మా! మన పాతయింటికి నిన్నరాత్రి యెవరో బైరాగి వచ్చి వెళ్ళిపోయారట. రమణమ్మ చెప్పింది బడిలో...'

'హాఁ! వచ్చి వెళ్ళిపోయారా అమ్మా?'

'వదినా! అన్నయ్య వచ్చి వుంటారేమో! నేవెళ్ళి ఆ పొరుగువారిని కనుక్కుంటాను...యేమైనా చెప్తారేమో?'

రుక్మిణి నిట్టూర్పు విడిచింది. 'వెళ్తానువదినా' అంటూ

గమల లేచింది. 'వద్దమ్మా వద్దు. మనం వెళ్ళినా లాభం లేదు. ఆయనను కలుసుకున్నా యింటికిరారు. ఆవచ్చేరోజులు దగ్గర పడలేదు. వదినమాటలువిన్నాక కమలం ఆశ్చర్యంతో 'వదినా, యేం? యెంచేత రారు? నేను అన్నయ్యకాళ్లమీద పడ్తాను' అంది.

'అమ్మా! నామనసులో వున్నది చెప్తున్నా- నీకు పెండ్లి చేశానని, నీభర్తను ఆయనకు చూపిస్తేగాని ఆయన రారు'

'కులంనుంచి వెలివేశారుగా—' అని అప్రియత్నంగా కమలం అ ది.

'పోనీయమ్మా కులంతో యేముంది? గుణం ప్రధానంగాని'

వదినమాటలు విన్న కమలం తలదించి కాలివేళ్ల వేపు చూస్తూ దీర్ఘంగా యేదో ఆలోచిస్తోంది. పిల్లలు ఆమెను పిలిచారు చదువుచెప్పమని. 'మధ్యాహ్నంకూడా చదు వే నా? భోజనంచేసి చదువుకుందురుగాని' అని రుక్మిణి పిల్లలను భోజనానికి కూర్చోబెట్టింది.

మరో నాలుగు నెలలు సాగిపోయాయి. రుక్మిణి కమలంచేత పూజాపునస్కారాలు చెయ్యిస్తూనేవుంది. కమలంపెండ్లి యెలా చెయ్యటమా అనే సమస్య ఆమెను కలవరపరచకపోలేదు. దేనికైనా కాలంరావాలనీ, కానున్నది కాకమానదనీ, భగవంతుని నమ్మినవారికి నాశనంలేదని తలచుకొని సంతృప్తిపడేది. అప్పూర్లో నేవుంటే యెప్పటికైనా భర్తనుకలుసుకోటానికి అవకాశం వుంటుందని విశ్వసించింది. లోకంగోలకు ఆయన మనసెలా లొంగిపోయిందో అలాగే పిల్లలను చూడాలనే కోరికకు

లొంగిపోతుందని నమ్మింది. ఆ విశ్వాసమే ఆమెను ఆ వూర్లో వుండనిచ్చింది.

ఆరోజు మోహనుడు జ్వరంతో బాధపడుతున్నాడు. రుక్మిణి బజారుకు పోయింది. సరళా, రామం బడికి పోయారు. కమలం ఒక్కర్తే యింట్లోవుంది. యెవరో బైరాగులు ముష్టికి వచ్చారు పాడుకుంటూ. కమలం బియ్యంముష్టి వేస్తూ 'బాబూ మీగుంపులో కిష్టయ్య అనే పేరుతో యెవరైనా వున్నారా?' అని అడిగింది.

'లేరమ్మా. మీవాళ్లెవరైనా బైరాగుల్లో కలిసి పోయారా?'

'అవును బాబూ. మీకు ఆయనగురించి తెలుసునేమో అని.'

'సాధారణంగా బైరాగు లయ్యాక పేర్లుమార్చుకుంటాం. అనకాపల్లిలో మా గురువుగారి పీఠంవుంది. దేశదేశాలూతిరిగి సంవత్సరానికి ఒకసారి అక్కడ కలుసుకుంటాం. మనిషి యెలా వుంటాడు?'

'మనిషి మీకంటే పొడుగ్గా, చామనచాయగా వుంటారు. యెడమకాలి ముడుకుమీద పెద్దమచ్చ వుంటుంది. సైకిలుమీదనుంచి పడిపోతే ముడుకుమీద పెద్ద దెబ్బతగిలి వుండయింది. మానటానికి నాలుగు నెలలు పట్టింది. అప్పటి నుంచి సైకిలు తొక్కటమే మానివేశారు.'

'యేమో అమ్మా. యెవరో చెప్పలేం.' అని శలవు తీసుకొని వెళ్లిపోయారు.

మోహానుడు మంచినీరు కావాలని గోలపెట్టున్నాడు. పొరుగింటి మామ్మ వచ్చి 'ఆ సింహాద్రి అప్పన్నను తలచుకొని పిల్లాడిజబ్బు నయమైతే ఆయనదగ్గర కొప్పుతీయిస్తానని మొక్కుకోండమ్మా' అని చెప్పింది. కమలం మామ్మమాటలు విని మనసులో అలానమస్కరించుకుంది. మామ్మ కాస్సేపుకూర్చొని వెళ్లిపోయింది.

పొద్దున్న అసగా వెళ్లినరుక్మిణి పదిగంటలైనా యింకా రాలేదు. మోహానుడు అమ్మా, అమ్మా అని అరుస్తున్నాడు. కమలం ఓదారుస్తోంది. రుక్మిణి చిరునగవుతో యిట్లో ప్రవేశించింది. కమలం రుక్మిణిచిరునగవును చూడటం ఆ యింట్లోకి వచ్చాక అదే మొదటిసారి.

'వదినా! మోహన్ నీకోసం పలవరిస్తున్నాడు. ఇంత ఆలస్యం......'

'నీనుంచేనమ్మా. నీశాంతగుణమెదుటివారి హృదయాలను లోబరచుకోక యేంచేస్తుంది? మామయ్యగారిపేరు నిలబెట్టావు. వచ్చేనెలలో పెళ్లిముహూర్తంకూడా స్థిరమైంది.

కమలం మాట్లాడకుండా రుక్మిణి వేపు ఆశ్చరంగా చూస్తోంది.

'యేం కమలం? అలాచూస్తావేం? నీవు మెంచుకున్న వరుడే—మధుసూదనరావు.'

కమలం తలదించింది సిగ్గుతో. మధుసూదనరావు మునసబుకోర్టులో గుమస్తాగా పనిచేస్తున్నాడు. పుట్టుకచేత కమలం కులం, కమలంతెగే. మధుతల్లి చదుపుకుంది. ఆయన తండ్రి విధవావివాహం చేసుకున్నాడని పాతికసంవత్సరాలకిత్రం కులం

నుంచి వెలివేశారు. కమలం మధుచెల్లెలకు ఆరునెలల క్రితం నుంచి సంగీతం చెప్తోంది. అత నామెను ప్రేమించానన్నాడు. ఆమె నిరాకరించింది. ఆమె శాంతగుణం, అందం రానురాను ఆయనను పిచ్చెంత్తింది. రుక్మిణి ఒకనాడు కమలంతో 'కులంతో యేముంది? గుణం ప్రధానం' అని అన్నతరువాత ఆమె ప్రేమకై పరితపించే మధుతో యిలా అంది— 'నాలో ప్రేమ ఉంది. కాని నేను ప్రస్తుతం మిమ్మల్ని ప్రేమించలేను. మీతలి తండ్రులు సంతోషంగా ఒప్పుకొని, యిరువురికి పెండ్లి చేస్తే అప్పుడే నేను మిమ్మల్ని ప్రేమించగలను. నావదినా, పిల్లలూ వున్నారు. వారిని పోషించేబాధ్యత నాది అందుచేత ఒకవేళ పెండ్లి అయినా నన్నిలా ప్రయివేట్లు చెప్పుకోనివ్వడానికి మీరు అంగీకరించాలి, అప్పడే మిమ్మల్ని నేను ప్రేమించగలను.'

తలిదండ్రులతో యీవిషయం చెప్పనిడానికి మధు మొదట సంకోచించాడు. ఎలాగైతేనేమి చివరకు తల్లికి అన్ని విషయాలూ పూసగుచ్చినట్లు చెప్పి 'కమలంతో పెండ్లికి మెలాగైనా ఒప్పుకుంటేగాని వీలు లే' దన్నాడు. అమ్మ ఒప్పుకుంటే నాన్నతప్పక ఒప్పుకుంటాడని ఆయనకు విశ్వాసంవుంది. మధు తల్లి కమలంలాంటి సుగుణవతి తనకోడలు, కాబోతుందని మురిసిపోయింది కూడాను.

రుక్మిణియింటికి వస్తున్న మధుతల్లి ఆమెను యింటికి తీసుకుపోయి పెండ్లివిషయాలు చర్చించటంచేత ఆలస్యమైంది. మోహన్ జ్వరం పదిహేనురోజుల్లో నయమైంది. అరసవిల్లిలో దేవునిసాన్నిధ్యంలో కమలా, మధులకు వివాహంజరిగింది. కులంలో వెలివేయబడిన రెండు సాంప్రదాయకకుటుంబాలు

యీవివాహం వలన కలపబడ్డాయి. రుక్మిణి ఆయింటిని విడిచి పెట్టలేదు. కమలం అత్తవారి యింట్లోవున్నా రోజుకు రెండు సార్లు రుక్మిణిదగ్గిరకు వస్తుంది. పరివేట్లు మామూలుగానే చెప్తోంది.

౫

ఒకనాడు కొందరు సాధులు 'భిక్షాం దేహి' అంటూ కమలం యింటికి వచ్చారు. వారిని చూడగానే కమలానికి సింహాచలం మొక్కు జ్ఞాపకం వచ్చింది. రుక్మిణితో ఆవిషయం చెప్పి, ఆవచ్చే శనివారంనాడు రుక్మిణి, కమలం, మధు, పిల్లలూ బయలు దేరారు. కొండ యెక్కుతున్నారు.

ఒక బైరాగి సంసారసాగరములోని పాటుపోటులను భరించలేక సన్యాసి అయ్యాడు. సంఘంలో మసలలేక, సంఘ నిందలను భరించలేక, యేడ్చి, విరక్తిజెంది, భార్యాబిడ్డలను విడువలేక విడువలేక చివరకు కష్టంతో యింటినుంచి కదిలాడు. బైరాగి అయ్యాక తనపిల్లలుకనిపిస్తారేమో, నాన్నా నాన్నా అని తన్నుపిలుస్తారేమో అన్న ఆశతో చాలాసార్లు చీకటిలో ఆయింటిచుట్టూ తిరిగాడు. తాను బైరాగులలో కలిసిపోయాడు చెల్లెలిపెండ్లిచేయలేకా, నంఘంలో బ్రతకలేకాను. కలిసిపోయాక తనవారంతా జ్ఞాపకానికివచ్చారు. యేడ్చాడు. తన్ను వేదాంతులూ, బైరాగులూ పాడుచేశారని వారిని తెగ తిట్టాడు. తనవారిని కలుసుకుందామని ప్రబలాటపడ్డాడు. మరల ఆ సంసారంతో సంఘంలో తలెత్తి యెలాబ్రతకటం? మరల కుటుంబాన్ని యెలాపోషించడం? కులంనుంచి వెలివేయబడిన

తను తనసోదరికి యెలా పెండ్లి చేయడం? దొంగతనంచేసి డబ్బు సంపాదించి తన కుటుంబాన్ని కలుసుకుంటాను, తనపిల్లలను ముద్దులాడుతాను, తనచెల్లెలి పెండ్లి చేస్తాను అనుకొన్నాడు. కాని దొంగతనానికి ఆయనమనసు ఒప్పుకోలేదు. ఒక వేళ దొంగతనంచేసినా, డబ్బుకూడగట్టుకున్నా కమలాన్ని యే బ్రాహ్మణయువకుడు పెండ్లాడుతాడు అనే యీ నిస్పృహ ఆయనను విరాగిగా ఉంచింది. ఆయన దేవుని ప్రార్థించలేదు. తీర్థయాత్రలు సేవించలేదు. ఆజిల్లాలోనే వివిధప్రాంతాలు తిరిగాడు ఆవేదనతో. తనపిల్లలను యే ముఖంతో చూడగలనని దుఃఖించాడు. ఆశ మొలకెత్తితే అయన విరాగికాడు సంసారి కావాలని ఆయనహృదయకుహరంలో కోరిక తాండవిస్తోంది.

తనను వారు చూశారో, లేదో కాని వారిని ఆయన చూసి తలదించాడు. కాషాయవస్త్రం కప్పుకున్నాడు. తనను దాటుకొని వారుపైకి పోతున్నారు. అదిగో, మొదటి ధార దాటిపోయారు. తలెత్తాడు. తనకండ్లతో తన చెల్లీ, ఆచెల్లి ప్రక్కనే నడుస్తున్న ఒక యువకుడూ ఒకరివేపు ఒకరు చూసి నవ్వుకోవటం చూశాడు. అవును. ఆనవ్వులో వలపు పుట్టిపడుతోంది. నాచెల్లెలికి పెళ్లయిందా? సందేహంలేదు. నాచెల్లెలి భర్తే. అదిగో నా రుక్కు—నా అర్థాంగి—నుదుట కుంకుమ రేఖ తళ తళ మెరుస్తోంది. 'రుక్కూ? నీవు దేవతవే! అదిగో నా మోహనుడు. వాడిని యీహస్తాలతో యెత్తుకొని ఒక్క క్షణం విడిచిపెట్టేవాడిని కాదే. నాకూతురు సరళ— నాకొడుకు రామం. నాచిన్నారి చిట్టిబాబు ఆనందుడు. వారంతానావారు. నాపిల్లలు నన్ను 'నాన్నా' అని పిలవరే? నాచెల్లి నన్ను

అన్నయ్యా అని పిలవదే! నారుక్కు నవ్వుతూ......నాకెందు కీ సన్యాసం! పిలుస్తాను. నా పిల్లలను యెత్తుకొని ముద్దులాడుతాను. ఇవిగో నాపెదిమలుతొందరపడుతున్నాయి,నాకంఠంలో మాటలు దొర్లుకుపోతున్నాయి. నాకళ్ల వెంబడి ఆనంద బాష్పాలు రాలిపోతున్నాయి. పిలుస్తాను. ... అయ్యో! చాలా దూరం వెళ్లి పోయారు.

నేను పిచ్చివాణ్ణి. యీ సంసారంఅంతా ఒకబొంతకుట్టు. దారం తెగిపోతుంటే రుక్కుకొత్తదారంతో ధైర్యంగా కుట్తోంది. నారుక్కుమోములో పూర్వపు కళాకాంతులు లేవే! కాను, యెలావుంటాయి? నాలాంటిభర్తను కట్టుకొని గొప్పగా సుఖించింది!'

లేచాడు. రెండు అడుగులు ముందుకు వేశాడు; మరల వెనుకకు. 'నాకు గుండెవుంది. అందుచేత డబ్ డబ్ మని కొట్టుకొంటోంది! అరవటమేకాని కార్యశూరత్వంలేదు. రుక్మిణి గుండె శాంతంగా ... యెంత ధైర్యంగా...అవును. శాంతం, సహనం, ప్రేమలతో యెంతటి క్లిష్టకార్యాన్నైనా పరిష్కరించవచ్చు. మన బాపూజీ చెప్పింది యిదే — నాన్న చెప్పిందీ యిదే! భిన్నమార్గాన్ని తొక్కి నేను నా భార్యాబిడ్డలకు దూరమయ్యాను. నారుక్కు ఆమార్గాన్నితొక్కి జయం పొందింది. ఆమె దేవతాస్వరూపిణి. ఆమెను పూజించాలి.'

కూర్చున్నాడు, తన తెలివితక్కువకు యేడ్చుకున్నాడు. తన భార్యతో 'నేను నీభర్త' నని యేముఖంతో చెప్పగలుగుతాడు? తన పిల్లలు తన వేషాన్ని చూసి తనదరిచేరుతారా? తన చెల్లి తన్నుక్షమిస్తుందా? పశ్చాత్తాపముతో క్రుంగిపోయాడు.

యెండ చల్లారింది. తనకొడుకు మోహన్ మూరిపో యాడు. జుత్తు దేవునికి అప్పగించాడు. మెట్లు దిగుతున్నారు— తనపిల్లలూ, తనభార్యా, తనచెల్లీ, చెల్లిభర్తా. పిల్లలను యెంత శుభ్రంగా వుంచింది! తనువస్త్రాన్ని కప్పుకొని తలదించాడు.

అవిగో తనభార్యపాదాలు. పాదాలపై పడి మొక్కు దామనుకున్నాడు. భిక్ష — చేరెడుబియ్యం తన యెదుట పోస్తోంది. జలజల బియ్యం ఆమెచేతిలోనుంచి రాలుతుంటే ఆయనకళ్ల వెంబడి కన్నీరు బొలబొలా కారుతోంది. సిగ్గు, పశ్చాత్తాపం, ఆవేదనా ఆయనను నమిలి మింగివేస్తున్నాయి.

పాదాలు మాయమైపోయాయి. తలెత్తాడు యింకా తనచెల్లి వెనుకనేవుంది. ఆయువకుడు ఆమెను పిలుస్తున్నాడు. 'అమ్మా! కమలం!' గట్టిగా పిలిచాననుకున్నాడు. కాని ఆమా టలు ఆయనగుండెలలోనే ప్రతిధ్వనించాయి. వెనుకబడిన కమలం తనయెదురుగానేవుంది. యెవరో తన్ను పిలిచినారని చుట్టూ చూసింది. వెక్కి వెక్కి తలదించి యేడుస్తున్న బైరా గిని చూసింది.

'ఏం బాబూ! యీ పవిత్రస్థలంలో యేడుస్తున్నారు?'

'..................'

'తలదించి యేడవకండి. తప్పు, తమపేరు?'

ఆయన మాట్లాడలేదు. గాలివీచింది. కప్పుకున్న కాషా యవస్త్రం యెగిరింది. 'యీశరీరచ్ఛాయ—యీయేడుపు— అదిగో ముడుకుమీది మచ్చ—యెవరు? అన్నయ్య! సంశయం లేదు. అన్నయ్యను బసకు తీసుకపోయి ఆయనకాళ్లమీద

పడాలి. యిక్కడగోలచేస్తే లాభంలేదు...' కమలం మనసులో ఆలోచనలు పరుగెత్తాయి.

'బాబూ! ఒక్కసారి మావూరు దయచేయండి. మీ పాదపూజ చేసుకొంటాం...'

'..................'

'రండి బాబూ, రండి... యేడవకండి. దేవుని నమ్మిన వారికి నాశనంలేదు.' అంటూ కమలం తనయెదురుగానున్న భిక్షకై పరచిన వస్త్రాన్ని చుట్టి ఆయనచేయి పట్టుకొని లేవనెత్తింది. తనవేపు తిరిగి వస్తున్న మధు వింతగా చూస్తున్నాడు. వూరుకోమని రుక్మిణికీ, మధుకూ సైగచేసింది. రెండునిమిషాలలో మెట్లుదిగారు. ఆయన తల దించేవున్నాడు. గజగజ వణికిపోతున్నాడు.

వారు సామానులుంచిన ధర్మసత్రపు గది చేరుకున్నారు. ఆయన మాట్లాడలేదు. తలదించేవున్నాడు. గాఢమైన నిట్టూర్పులు విడుస్తున్నాడు.

'యీవిడ మావదిన. యీయన నాభర్త. యీపిల్లలు మాఅన్నయ్య బిడ్డలు. మాఅన్నయ్య నాపెండ్లికై పరితపించి బైరాగులలో కలిసిపోయారు. నాకిప్పుడు పెండ్లయింది. నేను ప్రయివేట్లు చెప్పి డబ్బుతెస్తున్నా. పిల్లలూ, వదినా, నేనూ అంతా సుఖంగా కాలంగడుపుతున్నాం. మావదిన మాఅన్నయ్య సాధించలేని కార్యాలను ధైర్యంతో ధర్మంగా సాధించగలిగింది. మాకున్న విచారం ఒక్కటే — మా అన్నయ్య మాలోచేరలేదని. మా అన్నయ్యకోసమే మేం బ్రతికున్నాం.

మా అన్నయ్యను పూజించాలనే మేం బ్రతికున్నాం మాఅ న్నయ్య మా యింట్లో వుంటేచాలు. మాయిల్లు వెలుగుతుంది ......' అని కమలం మాటలతో ఆయనమనస్సు మార్చు దామని యింకా ప్రయత్నిస్తోంది. రుక్మిణి యింకెంత సేపూ ఆగలేకపోయింది. కమలంమాట వినలేదు. ఆయన పాదాలపై వాలిపోయింది కన్నీటితో. ఆమెనుచూచి పిల్లలు అమ్మపై వాలిపోయారు. కమలం 'అన్నయ్యా'అంటూ ఆయనకాళ్లపై పడింది.

ఆయన రాల్చిన కన్నీటిబొట్లు వారందరిపైన పడ్డాయి. వారికన్నీటితో కలిశాయి. 'నా రక్తములో రక్తం— నా పిల్లలు. నాలో అర్థభాగం—కాని భిన్నహృదయం. కష్టాలను యెదుర్కొంది నారుక్కు. నాచెల్లి నాపిల్లలను పోషించింది' ఆయన గోలపెట్టాడు. పిల్లలను యెత్తుకొని యేడ్చాడు. భార్యానూ, కమలాన్నీ లేవనెత్తాడు. రుక్మిణిని క్షమించమని వేడుకున్నాడు. కారే కన్నీటిని ఆమె తుడిచింది. అనుగ్రహిం చమని ఆయనను వేడుకుంది.

కాషాయవస్త్రాలు మాయమయ్యాయి. ఆయన కమ లానందస్వామి కాడు—కిష్టయ్య. లోకం యిప్పుడు ఆయన నేమన్నా ఖాతరులేదు. తనకు కావలసింది - తనభార్యాపిల్లలు, తన చెల్లి బాగు, తన ఆనందం!